


# మగ(గా)డు

ఎస్. వీల

ఆ ఇల్లు చాలా పెద్దది.

అంతకన్నా చాలా అందమైనది. ఆ ఇల్లు, పరిసరాలు మనిషికి సంఘంలో పరపతిని పెంచేవిగా, మనసుకు ప్రశాంతత నిచ్చేవిగా ఉన్నాయి.

అది పబ్లిక్ ప్రాసిక్యూటరైన చంద్రశేఖర్ ఇల్లు. ఆ ఇంట్లో చుక్కలు వెలిగిన వేళ అతని ఇల్లాలు యశోధర ఒంటరిగా హాల్లో కూర్చుని ఉంది. చేతిలో ఏదో పత్రికున్నా మనసు దానిమీద లేనట్టుగా పేజీలు తిప్పుతున్నాయి వేళ్ళు.

సమయం రాత్రి పదకొండు కావస్తూంది. ఎక్కడా సందడి లేదు. ప్రకృతంత అలసి సొలసి, నిద్రిస్తోంది నిశ్శబ్దంగా.

అయినా చంద్రశేఖర్ రాలే దింకా. ఇప్పట్లో రాడు కూడా. అతని సమయం తనకి తెలుసు. అయినా అర్థం లేని ఎదురు చూపు. ఆమె లేచి పిల్లల గదుల వైపు వెళ్ళింది.

కొడుకు నిఖిల్ గదిలో లైటు ఆరిపోయింది. అయినా ఇంకా రికార్డ్ ప్లేయర్ మోగుతూనే ఉంది సన్నగా. యశోధర వెళ్ళి లైటు వేసింది. దాన్ని ఆఫ్ చేస్తూ కొడుకు వంక చూసింది.

ప్రకృతి విడిచిన విరహపు నిట్టూర్పుతో కూడిన కోరిక వల్ల కలిగిన తపః ఫల మిది. అచ్చు తండ్రి పోలికే

ఏనాడూ మౌనిలా ఇంట తిరిగే తన తల్లి గుండెలోతులను అతను గమనించే ప్రయత్నం చేయడు. తండ్రి అనురాగపు చిరు జల్లుల బ్రతుకు బాటలో అతని కడగంటి అనురాగపూర్తిమైన వీక్షణం కోసం ఎడతెగకుండా అన్వేషించి తన తల్లి మనసు పొరల్ని ఏనాడూ ఆ కొడుకుకు స్పృశించి ఎరగడు.

అతనికి తెలిసిం దల్లా ఏ రాత్రి వేళయినా, ఏ సమయంలోనైనా అమ్మ ఉంది ఇంట్లో. ఆవిడే తన క్కావాల్సినవన్నీ చూసుకుంటుంది అన్న ధీమా ఒక్కటే.

యశోధర ఏనాడూ వీటి గురించి ఆలోచించదు. తను స్త్రీ!. భర్తకూ, పుత్రులకూ సేవలు చేయడం తప్ప ఫలితం ఆశించని ఆడది.

యశోధర లైట్ ఆఫ్ చేసి, కూతురి గదిలోకి వెళ్ళింది. పద్దెని దేళ్ళ నిషి పలచని నైట్ గౌనులో, గుండెల మీద ఏదో ఇంగ్లీష్ నవల ఉంచుకుని అలాగే నిద్రపోతోంది.

పురుషాహంకారంతో భర్త ప్రసాదించిన వర మిది. అందుకే నేమో ఎప్పుడో ఒకసారి ఆ కళ్ళు కరుణతో తన వంక చూస్తాయి. ప్రేమ, అప్యాయతల కోసం ఈ మౌన ప్రణయిని తపస్సును పసిగట్టినట్లుగా 'డాడీ మమ్మీకి అన్యాయం చేస్తున్నాడు' అనుకుంటుంది దయగా అప్పుడప్పుడూ. వెంటనే తండ్రి చూపే వాత్సల్యంలో దాన్ని మరిచిపోతూంటుంది.

యశోధర పుస్తకాన్ని తీసి రగ్గు కప్పుతుంటే మత్తుగా కళ్ళు తెరిచి "గుడ్ నైట్ మమ్మీ!" అన్నది. యశోధర చిన్నగా నవ్వి తల నిమిరి వచ్చేసింది.

ఎదురుగా టీపాయ్ మీద ట్రేలో మల్లె మొగ్గలు కుప్పగా పోసి ఉన్నాయి. అవి అప్పుడే విచ్చుకొని, తమ సౌకుమార్యాన్ని ప్రదర్శిస్తూ సుకుమారంగా సువాసనల్ని వెదజల్లుతున్నాయి.

పొలం నుంచి మధ్యాహ్నం పాలేరు తెచ్చి ఇచ్చాడు. మల్లె తోట విరగ గాస్తూం దంటూ. యశోధర వాటిని అరచేతుల్లోకి తీసుకుని, అపురూపంగా చూసింది వాటి వంక.

ఊహుం! ఆయన కిష్ట ముండదు!

ముగ్ధగా తెల్లచీరలో అపురూపంగా మల్లెలు కుట్టిన జడ బరువుతో తలని నిటారుగా నిలబెడుతుంటే, సిగ్గు బరువు తలని వంచుతుంటే తొలి రాత్రి చేరవచ్చిన తనతో "నీకు మల్లె పూలు సూ టవలేదు. సృష్టిలో ఏవైనా నల్లటి పూలుంటే బావుండు. నీ రంగుకు నప్పేవి." మంచం మధ్యలో విలాసంగా కూర్చుని సిగరెట్ తగుతూ అన్న చంద్రశేఖర్ మాట లవి!

ప్రణయ తపస్వీలా వచ్చిన తన మనసుని, లోతుగా గాయం చేశా యవి. వెంటనే నేల మీద కూర్చుని వాటిని తీసేసింది.

ఎందుకు తీస్తున్నావని చంద్రశేఖర్ ప్రశ్నించలేదు. అస లతను ఆమెను పట్టించుకోలేదు. కనీసం పక్కన ఉన్నట్టుగా ఆమె ఉనికినైనా అతను గమనించలేదు.

ఆమె దూరంగా ఉండటం తన కిష్టమని తెలియచేస్తూ, ఓ దిండు, బెడ్ షీట్ అందించాడు. వాటిని పరచుకొని పడుకుంది.

అలా మొదలైంది తన వైవాహిక జీవితం! మార్పు లేకుండానే భర్త వెంట వెళ్ళింది. అతనికి ఆ ఇంట్లో వెనకా, ముందూ ఎవరూ లేరు. సంసారం లక్ష్మీ నిలయం. తల్లీ తండ్రీ చచ్చిపోగా మిగిలిన నానమ్మ చివరి కోరిక మేరకు అవిడకు వరసైన యశోధరని స్వీకరించాడు. కాని మనస్ఫూర్తిగా హృదయంలోకి ఆహ్వానించలేకపోయాడు.

పెద్దగా మార్పు లేకుండానే బ్రతుకు బండి సాగిపోతోంది. దీపావళికి జీప్‌లో పుట్టింటికి వెళ్ళింది. ఖరీదైన చీరలతో, ఒంటినిండా నగలతో సామాన్యుల ఇంటి ఆడపడుచు ఆ ఇంట జీప్ దిగడం విశేషమే! అంతే కాదు, తెల్లగా, ఎత్తుగా అందంగా ఉండి, చదువు, సంపద కలిగిన చంద్రశేఖర్ భార్య కావటం మరీ అదృష్టంగా భావించారు. అందరూ యశోధర కాలు కింద పెడితే కందిపోతుందేమో అన్నంత అపురూపంగా చూస్తున్నారు.

ఆ సాయంత్రం చెల్లెలు మంజీర భర్తతో రిక్షాలో వచ్చింది. ఆమె చేతల్లో, మాటల్లో పుట్టింటి కొచ్చిన ఆనందం స్పష్టంగా కనిపిస్తోంది. మంజీరకు అప్పుడే రెండో నెలట - గలగలా నవ్వుతూ చెప్పింది.

గుండె లోంచి బాధ చివ్వున ఎగదన్నింది.

ఇద్దరి పెళ్ళిళ్ళూ ఒకేసారి అయ్యాయి. అయినా అదృష్టంలో తనే మేటి.

తెల్లవారితే భోగి.

అందరూ చీకటితోనే లేచి తల స్నానాలు చేశారు. అప్పటి నుంచి వచ్చిన అల్లుడి మర్యాదలతోనూ, రాని అల్లుడు చంద్రశేఖర్‌కు చేయబోయే మర్యాదల గురించి ఎదురుచూస్తూ ఆలోచిస్తున్నారు.

వదినెలు మరదళ్ళని హాస్యాలు పట్టిస్తూ, పిండివంటలు చేస్తున్నారు. వదినలకు చిరునవ్వునే సమాధానంగా ఇచ్చి భర్త కోసం వేయికళ్ళతో ఎదురు చూస్తోంది అంతరంగంలో. అంతకన్నా ఏం చేయగలదు?

భర్త అనురాగ హృదయంలో పై పొరకన్నా తన మన సింత వరకు స్పృశించలేదు మరి.

వాకిట్లో జీపు ఆగింది.

ఇంటిల్లిపాదీ అతనికి ఎదురు వెళ్ళి స్వాగతం చెప్పి ఆహ్వానించారు. తెల్లటి దుస్తుల్లో అందమైన రోమన్ వీరుడిలా జీపు దిగే చంద్రశేఖర్‌ని తలుపు చాటు నుంచే చూసింది యశోధర.

చామంతి, బంతి, మల్లె, గులాబీ పూల బుట్టలతోపాటు, అరటి గెలలు, కొబ్బరికాయలు, కూరగాయల బుట్టలు తెచ్చి ఇంట్లో పెట్టాడు డ్రైవర్.

మామగారికి నమస్కారం చేస్తూ బావమరదులకు షేక్‌హాండ్ ఇస్తూ, అందరినీ చిరునవ్వుతో పలకరిస్తూ ఇంట్లో కొచ్చాడు చంద్రశేఖర్.

అతనికి రాచ మర్యాదలు జరుగుతున్నాయి.

తలుపు వెనక నుంచి క్రీగంట అతన్ని చూస్తున్న యశోధర అతను అందరితో చనువుగా ఉండటం చూసి, మనసు ఆనందంతో గంతులేసింది. రాత్రి కావటం కోసం వేయి కళ్ళతో ఎదురు చూసింది.

చీకటి చిక్కబడింది.

వద్దంటున్నా వదిన కట్టించిన తెల్ల జరీ చీర విప్పేయలేకపోయినా, తలలో పూ లేవీ ఉంచుకోకుండా జాగ్రత్త పడి, అతన్ని చేరింది. మంచం మీద దిండుని ఆనుకుని పడుకున్నట్టుగా కూర్చున్న అతని విలాసంలో, ఆమెని చూడగానే కనుబొమ్మలు చికాకుతో ముడుచుకున్నాయి. ఆమె పట్ల అతని అనురాగం పాషాణంలా మారిపోయింది.

"నీ కీ చీర అందంగా ఉంటుందని కట్టుకున్నావా?" అతని మాటలు ఆమె హృదయం మీద సమ్మెట పోట్లు పొడిచాయి. తెలియని ఆశతో ఉన్న మనసు అవమానంతో ముడుచుకుపోయింది.

తను నల్లటిదని తెలుసు. అయినా ఎందు కీ మాటలు? పెళ్ళి జరిగిపోయాక ఈ అసహన మెందుకు? ముందే చెప్పి ఉండొచ్చుగా అనుకుంది. అతని మాటలు మరోసారి ఆమె గుండెల్ని తూట్లు పొడిచాయి.

ఆ రాత్రి కూడా అతను చెప్పకుండానే తనే దిండు తీసుకెళ్ళి సోఫాలో పడుకుంది.

ఎవరికి చెప్పాలన్నా సిగ్గు! బిడియం, భయం, అవమానం. హాస్యాలాడే వదినలతో ఏమని చెప్పగలదు త నింకా కన్యే అని.

అతని వెంట వెళ్ళింది మౌనంగా పండుగ తరువాత. మార్పు లేని కాలచక్రంలో మరో ఋతువు మారింది. వర్ష ఋతువు తన జలంతో ధరణిని తన్మయత్వంతో కౌగిలించుకుని ఉక్కిరి బిక్కిరి చేస్తున్న వేళ! కోరికతో కాగిపోయిన అతను ఆమెని తెలియని మోహావేశంతో దరిజేరాడు తొలిసారిగా. ఫలితమే నిఖిల్ పుట్టుక!

మరో నాలుగేళ్ళ తరువాత పార్టీ మత్తులో ఉన్న అతను పురుషాహంకారంతో ఆమెని చేరిన అనుభవమే నిషి పుట్టుక!

రెండు శిశు జన్మలకీ కేవలం సృష్టి కొరకు సంగమించే ఆది దంపతుల్లా తను... అతడు...!

అలాగే మార్పు లేని జీవితం కొనసాగుతోంది.

అతను ఆనాడూ, ఈనాడూ, ఏనాడూ పలకరించడు. ఆశ్రితులపైన కనబరిచే కనీస ధర్మాన్నైనా పాటించలేదు.

అతనికి తెలిసిం దల్లా తన అవసరాల్ని కనిపెట్టి తీర్చే ఓ స్త్రీ అనే యంత్రం త నింట్లో ఉందని. కూడు, గుడ్డ తప్ప ఆమెకి మ రేమీ అవసరం లేదనుకొనే మగ[గా]డు మరి!

అత నీ మధ్య తన వృత్తికి రిజైన్ చేసి పొలిటికల్ లీడర్‌గా గుర్తింపు పొందాడు. సమాజానికీ, దేశానికీ అతను అవసరమైన వ్యక్తి.

మరి భార్యకో? అతను వట్టి మగ[గా]డు మాత్రమే!


ఆలోచిస్తున్న యశోధర భర్త రావటం చూసి, తొట్రుపాటుతో లేచి నిలబడింది. అతను కోటు విప్పుతుంటే అందుకుంది. కూర్చుంటే బూట్లు విప్పింది. బాత్ రూంకి వెళితే, టవల్‌తో వెళ్ళి

## చిట్కా

"ఏమయ్యా మీ ఆవు ఎక్కువ పాలివ్వాలంటే సంగీతం వినిపించమన్నాను కదా! నా చిట్కా పని చేసినట్టేనా?" గొప్పగా అడిగాడు పశువుల డాక్టర్.

"పని చేసినట్టిగాని బాబూ, డాన్స్ చేస్తున్న ఆవు దగ్గర పా లెలా తియ్యాలో నాకే తెలియడం లేదండీ!" దిగాలుగా చెప్పాడు సోమయ్య.

- పి.వి. నరసింహారావు



స్నానానికి నీళ్ళు నింపింది. బయటికి రాగానే ఆహార పదార్థాల్ని వెచ్చ చేసి వేడిగా వడ్డించింది.

అతను అన్ని అవసరాల్ని తీర్చుకుని పడుకున్నాడు. అదే గదిలో కొంచెం దూరంగా వేరే మంచం పైన యశోధర పడుకుంది.

అతన్ని ఏదైనా తనంత తానుగా అడగాలంటే ఆమెకి భయమే! తాకాలంటే సంకోచమే!

అత నామెని ఏమీ అనడు. ఒక్క చూపుతో ఆమెని నిలువెల్లా వణికించేలా మాత్రం చేయగలడు. ఆ చూపుల్లోని కాఠిన్యం, ఏహ్యాభావం, జుగుప్సా ఆమెని అతనికి ఆమడ దూరం తరిమేలా ఉంటాయి.

అందుకే అతను అతనే! ఆమె ఆమే!

చిగురు లేసే అనురాగాన్ని ముక్కలు చేయటానికి వచ్చే వేటగాడు అతను. అయినా ఆమె అనురాగ మనే వృక్షాన్ని ఆప్యాయతనే ఆకులతో అతని కోసం చివురింపజేస్తూనే ఉంటుంది.

** ** **

అలవాటైన ఆవేదనతో పడుకున్న ఆమె ఉలికిపడి లేచింది. ఇల్లంతా చిక్కని చీకటి. అంతటా గడ్డకట్టుకున్న నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దంలోనే వచ్చే పాదాల శబ్దం. ఎవరో బరువుగా నడుస్తున్న సవ్వడి.

ఆమె అదిరిపాటుతో తన దగ్గరున్న లైట్ స్విచ్ నొక్కింది. అది వెలగలేదు. భయంతో ఆమె గుండె పిడగట్టి నట్టయింది. భర్తని పిలుద్దామంటే సంకోచం.

"ఆ పనివాళ్ళున్న తలుపేసి వచ్చావా?"

"ఆ.., అందరి గదులకి గొళ్ళెం పెట్టాను. ఇక కానిద్దామా?" ఎవరివో సన్నని మాటలు గుసగుస లాడుతున్నట్టు.

యశోధర కా ఆలోచన మెరుపులా వచ్చింది.

ఇప్పటికే ఎన్నోసార్లు భర్తపైన హత్యా ప్రయత్నం జరిగింది. రాజకీయాల్లో దిగిన అతనికి ఆపద వెన్నంటే ఉంది. చీకట్లో ఎవరివో నీడలు పొడుగ్గా భర్త మంచం వేపు సాగుతున్నాయి.

## శవతార

ఒక మహానటుడు ఒక చిత్ర విమర్శకునితో "ఫలానా చిత్రంలో నా నటన సన్నివేశంలో అత్యున్నంతంగా ఉం"దని అడిగాడట. అందుకు ఆయన "మీరు శిలగా మారిపోయిన సన్నివేశంలో మహాద్భుతంగా ఉం"దని జవా బిచ్చాడట. ఒక్కసారి నటించే అవసరం లేకపోయినా అద్భుతమైన నటులుగా అయినవారి జీవితాలు కూడా ఉన్నాయి. గాబీయూజర్ అనే హాలీవుడ్ నటి తారాపథంలో ఉజ్జ్వలంగా ప్రకాశించిన నటి. కానీ ఆమె తన మొట్టమొదటి చిత్రంలో పోషించింది కేవలం ఒక శవ పాత్రనే. 'స్లీపింగ్ బ్యూటీ'గా కనిపించిన ఆమె అందచందాలు చూసి నిర్మాతలు ఆమెను తమ చిత్రాల్లో నాయికగా బుక్ చేసుకున్నారు. అంతటితో ఆమె అంచెలంచెలుగా తారాపథాన్ని అధిరోహించింది.

-కె. ఆర్. కె. మోహన్

యశోధర ఆగలేదు ఇక!

వెంటనే తన మంచం పై నుంచీ లేచి, భర్త మీద వెల్లకిలా పడి కావలించుకుంది. ఆమె శరీరం అతని ముఖ్యమైన శరీర భాగాన్నంత కనిపించకుండా ఆక్రమించుకుంది.

అది తొలి కలయిక! ఆమె దాని పరిణామం గురించి ఆలోచించలేదు. ఆ క్షణంలో భర్త ప్రాణం మాత్రమే విలువైనదిగా ఎంచి, తనే వారికి అందుబాటులో నిల్చుంది.

లైటు వెలిగింది. తెల్లని వెలుతురులో నల్లని ఆకారాలు, చేతులలో గొడ్డళ్ళు పట్టుకుని. ఆమె వెర్రి కేక వేస్తూ "వద్దు వద్దు, చంపద్దు!" అరుస్తోంది పిచ్చిదానిలా.

ఎత్తిన మారణాయుధాలు దిగిపోయాయి.

ఆకుపచ్చ, ఎరుపు గాజులతో నిండిన చేతులతో భర్త శరీరాన్ని ఆర్తిగా కౌగిలించుకుని ఉంది. ఇద్దరి అనుబంధానికి గుర్తుగా ముందరికి పడిన మంగళసూత్రం గొలుసు అతని హృదయం మీద పడి ఆమె మనసుని అతనికి తెలిపరచటాని కన్నట్లుగా, అతని అనురాగపు లోతుల్ని కొలుస్తోంది.

"లె గెహె! యియ్యాల ఆడి పనవ్వాల!" హెచ్చరించా డొకడు మోటుగా. "ఊహుం! మీరు వేసే ప్రతి వేటు నా మీద నుంచి అతన్ని చేరాలి." నిశ్చలంగా అంది.

వారి మారణాయుధాలు మరోసారి నిశ్చయంగా నిస్సహాయమయ్యాయి. శబ్దం రాకుండా తప్పుకోవటానికి వెనక్కి తిరుగుతూ "నా యా లా! ఆడ కూతురి వల్ల బతికిపోనావు! చూస్తూ చూస్తూ ఓ ఆడకూతుర్ని చంపటానికి మనసు రావట్లే!" అంటూ వెళ్ళిపోయారు.

వాళ్ళు వెళ్ళగానే చట్టుక్కున పైకి లేచింది. భయంతో ఆమె శరీరం చిగురు టాకులా కంపిస్తోంది. తల వంచి భర్త ఎదుట కూర్చుంటూ "నా ఈ చనువుకి ఏ శిక్ష విధించినా సరే! ఇంతకన్నా ఏం చేయాలో తెలియక..." మెల్లగా అంది.

అన్నీ గమనిస్తున్న చంద్రశేఖర్ ఆమె సాహసానికి అచ్చెరు వొందాడు. తనే అయి ఉంటే తన అందానికి గౌరవం కలిగించలేని ఈ 'నల్లటిదాన్ని' అక్కడే వదిలేసేవాడేమో!

అతనిలో ఏ మూలో ఓ భాగం తెరుచుకుంది. కరడుగట్టిన అనురాగం కరిగి వెల్లువై ప్రవహిస్తోంది. అతను చటుక్కున లేచి ఆమెను హృదయానికి హత్తుకున్నాడు ఇష్టంగా.

అనురాగ ఝరిలో ఆమె.

దాన్ని ఆస్వాదిస్తూ అతను.

శిశిరానికి వసంతపు తొడుగు తొడిగినట్టుగా ప్రౌఢ వయసులోనూ సిగ్గుపడింది తొలిసారిగా. అతని కౌగిలి నుంచి విడివడింది ఈసారి కూడా. అయితే అది భయంతో కాదు, సిగ్గుతో.

ఇప్పు డామె రూపం అతనికి కనిపించటం లేదు. మనసు కనిపిస్తోంది.!

నిన్నటి వరకూ అతను ఒక 'మగాడు'. నేడు ఒక 'మగడు' మరి! ★

## సంక్రాంతీ స్వాగతం

పట్టుచీర లేదు
కొత్త కోకయు లేదు
శుద్ధ వస్త్రముతోనె
ప్రార్థింతు నమ్మ !

కీర్తనలు రావు
పద్దెమైననూ రాదు
స్థిరమైన మనసుతో
స్మరింతు నమ్మ !

పాయసము లేదు
పటికబెల్లమూ లేదు



పత్రి, ఆకులతోనె
పూజింతు నమ్మ !

శ్రీలక్ష్మి, వరలక్ష్మి
సౌభాగ్యలక్ష్మీ !

శుభములను కలిగించు
ఓ విజయలక్ష్మీ !

సిరు లిచ్చి మమ్మేల్ల కరుణించ వమ్మా !
సంక్రాంతి లక్ష్మి స్వాగతము గొనుమా !

-ఏ. వి. భాస్కరరావు